తూప్రాన్ మండలం రావెల్లి శివారులో కుప్పకూలిన శిక్షణ విమానం

శిక్షణ విమానం కూలి ఇద్దరి దుర్మరణం

- మృతుల్లో ఒకరు పైలట్, మరొకరు ట్రైనీ పైలట్
- ప్రమాదానికి గల కారణాలపై ఐఏఎఫ్ విచారణ

హైదరాబాద్, డిసెంబర్ 4 (నమస్తే తెలంగాణ)/తూప్రాన్: దుండిగల్ ఎయిర్‌ఫోర్స్ అకాడమీకి చెందిన శిక్షణ విమానం (పీసీ 7 ఎంకే) సాంకేతిక లోపంతో కుప్పకూలింది. సోమవారం ఉదయం మెదక్ జిల్లా తూప్రాన్ మండలం రావెల్లి శివారులో జరిగిన ఈ దుర్ఘటనలో ఇద్దరు దుర్మరణం చెందారు. వీరిలో ఒకరు పైలట్ కాగా.. మరొకరు ట్రైనీ పైలట్. దుండిగల్ ఎయిర్‌ఫోర్స్‌కు చెందిన శిక్షణ విమానం రోజువారీ ట్రైనింగ్‌లో భాగంగా ఇద్దరు వ్యక్తులు ఉవాన్ తాయి, అభిమన్యులతో ఎయిర్‌బేస్ నుంచి బయలుదేరింది. రావెల్లి శివారుకు రాగానే విమానంలో సాంకేతిక సమస్య తలెత్తి టాటా కాఫీ పరిశ్రమ సమీపంలో ఉన్న రాళ్లగుట్టపై కూలిపోయింది. వెంటనే మంటలు అంటుకోవడంతో విమానంలో ఉన్న వియత్నాం దేశస్థుడు ఉవాన్‌తాయి, అభిమన్యు కాలిబూడిదయ్యారు. వారి మృతదేహాలు గుర్తుపట్టలేనంతగా కాలిపోయాయి. సమాచారం అందుకున్న దుండిగల్ ఎయిర్‌ఫోర్స్ అధికారులు సీఎన్‌సీ నాయర్, వింగ్ కమాండర్ శ్రీనివాసన్ ప్రత్యేక విమానంలో ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. అక్కడే పంచనామా నిర్వహించారు. ప్రమాద ఘటనపై విచారణ ప్రారంభించినట్టు ఎయిర్‌ఫోర్స్ అధికారులు తెలిపారు.

కాంగ్రెస్‌లో 'ముఖ్యమంత్రి' కయ్యం

- మరింత ముదిరిన సీఎం కుర్చీ లొల్లి
- సీఎంగా రేవంత్‌రెడ్డిని తీవ్రంగా వ్యతిరేకిస్తున్న భట్టి, ఉత్తమ్, శ్రీధర్‌బాబు, దామోదర, రాజగోపాల్
- తామేం తక్కువని పెద్దలకు ప్రశ్న
- రేవంత్‌కు తప్ప ఎవరికిచ్చినా పర్వాలేదంటున్న ఉత్తమ్
- రేవంత్‌రెడ్డి కింద మంత్రిగా చేసేందుకు ఉత్తమ్ ససేమిరా
- రంగంలోకి డీకే... పార్క్‌హయత్ హోటల్‌లో భట్టి, ఉత్తమ్‌తో భేటీ

ఎల్లా హోటల్‌లో నిర్వహించిన సీఎల్పీ మీటింగ్‌లో పాల్గొన్న కాంగ్రెస్ ఎమ్మెల్యేలు

హైదరాబాద్, డిసెంబర్ 4 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్‌లో సీఎం కుర్చీపై కయ్యం మరింత ముదిరింది. రేవంత్‌రెడ్డిని సీఎం చేయాలని పార్టీ భావిస్తున్నట్టు తెలిసింది. దీన్ని ఆ పార్టీ సీనియర్ నేతలు భట్టి విక్రమార్క, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, దామోదర రాజనర్సింహ, శ్రీధర్‌బాబు, రాజగోపాల్‌రెడ్డి వ్యతిరేకిస్తున్నట్టు సమాచారం. సీఎంగా రేవంత్‌ను ఎట్టి పరిస్థితుల్లో ఒప్పుకొనేది లేదని తేల్చి చెప్పినట్టు తెలిసింది. రేవంత్‌రెడ్డితో పోల్చితే తామేం తక్కువ అని అధిష్ఠానం దూతలను ప్రశ్నించినట్టు సమాచారం. ఈ అంశంపై సోమవారం హోటల్ ఎల్లాలో జరిగిన సమావేశంలో నేతల మధ్య వాగ్వాదం జరిగినట్టు తెలిసింది.

మంత్రిగా అనుభవం లేని వ్యక్తి సీఎంగానా?

సీఎంగా రేవంత్‌రెడ్డి తప్ప ఎవరిని ఎంపిక చేసినా పర్వాలేదని ఉత్తమ్, భట్టి, రాజనర్సింహ, రాజగోపాల్‌రెడ్డి తేల్చి చెప్పినట్టు సమాచారం. ఇందుకు వారు కొన్ని కారణాలను అధిష్ఠానం దూతలకు వివరించినట్టు తెలిసింది. రేవంత్‌కు పరిపాలన అనుభవం లేదని, ఆయన ఎమ్మెల్యేగానే చేశారు తప్ప ఎప్పుడూ ప్రభుత్వంలో ఉండలేదని చెప్పినట్టు తెలిసింది. ఓటుకు నోటు కేసులో ఆయన నిందితుడిగా ఉన్నారని, ఇది పార్టీకి ఇబ్బందికరంగా ఉంటుందని అన్నట్టు సమాచారం. ఎన్నికల ప్రచారంలో 3 గంటల కరెంట్‌తోపాటు ఇతర అంశాలపై అదుపు లేకుండా మాట్లాడారని ఫిర్యాదు చేసినట్టు తెలిసింది. ఇలాంటి వ్యక్తిని సీఎంను చేస్తే అది ప్రభుత్వానికి, పార్టీకి తీవ్ర నష్టం చేస్తుందని చెప్పినట్టు సమాచారం.

పదవుల ప్రతిపాదనపై నేతల ఆగ్రహం

సీఎల్పీ సమావేశంలో సీఎంతోపాటు ఇతర పదవులపైనా చర్చ జరిగినట్టు తెలిసింది. సీనియర్ నేత శ్రీధర్‌బాబుకు స్పీకర్ పదవి ఇస్తామని ప్రతిపాదించగా ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసినట్టు సమాచారం. అందరూ పార్టీని వదిలి వెళ్లిపోతున్నా తాను మాత్రం పార్టీని బలోపేతం చేసేందుకు కృషి చేశానని, అలాంటి తనకు స్పీకర్ పదవి ఇవ్వడమేంటని నిలదీసినట్టు తెలిసింది. ఒకవేళ తనకు స్పీకర్ ఇవ్వాలని నిర్ణయిస్తే.. ఏ పదవి కూడా అవసరం లేదని చెప్పినట్టు పార్టీ వర్గాల భోగట్టా. భట్టి విక్రమార్కకు స్పీకర్ పదవి ప్రతిపాదించగా, ఆయన కూడా తిరస్కరించినట్టు తెలిసింది. ఎవరికి వారు సీఎం పదవి లేదా కీలక పదవులపై పట్టుపట్టినట్టు సమాచారం.

అలిగిన సీనియర్లు.. బుజ్జగించిన డీకే

సీఎంగా రేవంత్‌రెడ్డివైపే అధిష్ఠానం మొగ్గు చూపుతుండటంతో సీనియర్ నేతలు అలిగినట్టు తెలిసింది. ఒక దశలో తాము సీఎల్పీ సమావేశానికి రాబోమంటూ భట్టి, ఉత్తమ్, రాజగోపాల్, దామోదర, శ్రీధర్‌బాబు తేల్చి చెప్పినట్టు సమాచారం. దీంతో రంగంలోకి దిగిన డీకే శివకుమార్ వీరందర్నీ పార్క్ హయత్‌కు పిలిపించుకొని చర్చలు జరిపారు. వారిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసినట్టు తెలిసింది. కొన్ని విషయాల్లో సర్దుకుపోవాలని సూచించినట్టు తెలిసింది. ఆ తర్వాతే వారు సీఎల్పీ సమావేశానికి రావడం గమనార్హం.

పైరవీలు.. బెదిరింపులు

సీఎం పదవితో పాటు మంత్రి పదవులపై పార్టీ నేతలు వర్గాలుగా విడిపోయినట్టు తెలిసింది. ఎవరికి వారు పదవుల కోసం తీవ్రస్థాయిలో పైరవీలు చేస్తున్నట్టు సమాచారం. రేవంత్‌రెడ్డికి డీకే మద్దతిస్తున్నట్టు తెలిసింది. దీంతో భట్టి, ఉత్తమ్‌తో పాటు ఇతర నేతలు ఢిల్లీ స్థాయిలో ఖర్గేతో, ఇతర కీలక నేతలతో మంతనాలు సాగించేందుకు ప్రయత్నం చేస్తున్నట్టు సమాచారం. కొందరు నేతలు రేవంత్‌రెడ్డికి సపోర్ట్ చేస్తుండగా మరికొంత మంది భట్టి, ఉత్తమ్‌కు మద్దతిస్తున్నట్టు తెలిసింది. కొందరు బెదిరింపులు, బ్లాక్‌మెయిల్‌కు దిగుతున్నట్టు సమాచారం. 'ఏం తమాషా చేస్తున్నారా? ఖమ్మంలో, గాంధీభవన్‌లో టీడీపీ జెండాలు ఎగరేస్తరు.. ఇది పార్టీ అనుకొంటున్నారా? ఇంకేమన్నానా? మా దగ్గర పది మంది ఎమ్మెల్యేలున్నారు. ఎక్కువతక్కువ మాట్లాడితే బయటకెళ్లిపోతం' అని కోమటిరెడ్డి బ్రదర్స్ బెదిరించినట్టు తెలిసింది.

సీఎం లీకులపై ఆగ్రహం

ఓట్ల లెక్కింపులో భాగంగా కాంగ్రెస్ పార్టీకి ఆధిక్యత స్పష్టమైనప్పటి నుంచి సీఎం అభ్యర్థిపై జోరుగా ప్రచారం మొదలైంది. రేవంత్‌రెడ్డి సీఎం అంటూ సోషల్ మీడియాలో జోరుగా ప్రచారం జరిగింది. అధికారులకు, పార్టీ నేతలకు సీఎం రేవంత్‌రెడ్డి అంటూ లీకులు వెళ్లాయి. దీనిపై సీనియర్ నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సోమవారం సీఎం ప్రమాణ స్వీకారం అంటూ మీడియాకు లీకులు ఇవ్వడం పైనా వారు ఫైర్ అయ్యారు. దీనిపై వారంతా అధిష్ఠానానికి ఫిర్యాదు చేసినట్టు తెలిసింది.

రాజ్‌భవన్‌లో సీఎం ప్రమాణ స్వీకారం చూసేందుకు వచ్చి, కార్యక్రమం వాయిదా పడడంతో నిరాశగా వెనుదిరుగుతున్న ఖమ్మం జిల్లాలోని ఇల్లెందు కాంగ్రెస్ కార్యకర్తలు

ఇవీ నేతల డిమాండ్ల చిట్టా

- తాను కష్టపడి పార్టీని గెలిపించానని, తనకే సీఎం పదవి ఇవ్వాలని రేవంత్‌రెడ్డి డిమాండ్ చేసినట్టు తెలిసింది. పార్టీకి అన్ని విధాలుగా సహకరిస్తానని, భవిష్యత్తులోనూ ఇలాంటి ఫలితాలే తీసుకోస్తానని ఆయన హామీ ఇచ్చినట్టు సమాచారం. తనకు సీఎం పదవి తప్ప మరో పదవి అవసరం లేదని తేల్చి చెప్పినట్టు తెలిసింది. అయితే, సీతక్కకు డిప్యూటీ సీఎం ఇవ్వాలని కోరినట్టు సమాచారం.
- తనకు సీఎం పదవి ఇవ్వకపోతే డిప్యూటీ సీఎంతోపాటు కీలక శాఖలతో మంత్రి పదవి ఇవ్వాలని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి డిమాండ్ చేసినట్టు సమాచారం. తన భార్యకు కూడా మంత్రి పదవి ఇవ్వాలని డిమాండ్ చేసినట్టు తెలిసింది.

  ఒకవేళ తనకు సీఎం పదవి ఇవ్వకపోతే పీసీసీ చీఫ్ పదవితోపాటు కీలక శాఖలతో డిప్యూటీ సీఎం పదవి ఇవ్వాలని భట్టి విక్రమార్క డిమాండ్ చేసినట్టు సమాచారం. మరో డిప్యూటీ సీఎం పదవి ఉండొద్దని ఆయన షరతు పెట్టినట్టు తెలిసింది.
- ఇక తనకు డిప్యూటీ సీఎం ఇవ్వాల్సిందేనని, గతంలోనూ తాను డిప్యూటీ సీఎంగా చేశానని దామోదర రాజనర్సింహ డిమాండ్ చేసినట్టు సమాచారం. తనకు ఇవ్వకుండా మాదిగలకు అన్యాయం చేయాలని చూస్తున్నారా? అని ప్రశ్నించినట్టు తెలిసింది.
- కీలక శాఖలతో తనకు మంత్రి పదవి ఇవ్వాలని సీనియర్ నేత శ్రీధర్‌బాబు డిమాండ్ చేసినట్టు సమాచారం.
- తన అన్న కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి సీఎం పదవి ఇవ్వాలని, లేనిపక్షంలో తామిద్దరికి మంత్రి పదవులు ఇవ్వాలని కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి డిమాండ్ చేసినట్టు తెలిసింది.
- తెలంగాణ తేవడంలో తాను కీలక పాత్ర పోషించానని, ఆ సమయంలో పార్టీలోనూ కీలకంగా వ్యవహరించానని, అలాంటి తనను సీఎం పదవికి ఎందుకు పరిగణనలోకి తీసుకోవడం లేదని పొన్నం ప్రభాకర్ ప్రశ్నించినట్టు తెలిసింది.
- పార్టీకి ఏది కావాలన్న చేస్తానని, తనకు కీలక శాఖలతో మంత్రి పదువు ఇవ్వాలని వివేక్ వెంకటస్వామి డిమాండ్ చేసినట్టు సమాచారం.

వృద్ధాశ్రమాలపై నివేదిక ఇవ్వండి: హైకోర్టు

హైదరాబాద్, డిసెంబర్ 4 (నమస్తే తెలంగాణ): రాష్ట్రవ్యాప్తంగా వృద్ధాశ్రమాల ఏర్పాటుపై వివరణ ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు జారీచేసింది. చట్ట ప్రకారం జిల్లాకొకటి ఉండాలనే నిబంధనను గుర్తుచేసింది. ఆ మేరకు ఉన్నాయో లేవో కౌంటర్ పిటిషన్ దాఖలు చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి, మహిళా శిశు సంక్షేమశాఖ డైరెక్టర్లకు సోమవారం నోటీసులు జారీచేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జే అనిల్‌కుమార్‌తో కూడిన ద్విసభ్య ధర్మాసనం ఉత్తర్వులు జారీచేసింది.

పర్యాటక ఎండీ సస్పెన్షన్‌పై నిర్ణయం తీసుకోండి

హైదరాబాద్, డిసెంబర్ 4(నమస్తే తెలంగాణ): ఎన్నికల కోడ్ ఉల్లంఘించినందుకు పర్యాటక శాఖ ఎండీ బీ మనోహర్‌రావును సస్పెండ్ చేస్తూ ఎన్నికల సంఘం ఇచ్చిన ఆదేశాలపై తగిన నిర్ణయం తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. రెండు వారాల్లో శాఖాపరమైన విచారణ పూర్తిచేసి అభియోగ పత్రం దాఖలు చేయాలని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జే అనిల్‌కుమార్‌తో కూడిన ద్విసభ్య ధర్మాసనం సోమవారం ఆదేశించింది. మహబూబ్‌నగర్ అసెంబ్లీస్థానానికి పోటీచేసిన అభ్యర్థి శ్రీనివాస్‌గౌడ్‌తో కలిసి తిరుమల వెళ్లారనే అభియోగాలపై స్పందించిన ఈసీ ఆయనను సస్పెండ్ చేసింది. ఈ చర్యను మనోహర్ హైకోర్టులో సవాల్ చేశారు. పర్యాటక శాఖ ద్వారా వెళ్లే వారికి తిరుమల దర్శనం టికెట్ల కోటా పెంపు నిమిత్తం అధికారిక పర్యటనలో భాగంగానే వెళ్లినట్టు ఆయన తరపు సీనియర్ న్యాయవాది శ్రీరఘురాం వాదించారు. వాదనల తర్వాత హైకోర్టు స్పందిస్తూ.. ప్రభుత్వం విచారణ జరిపి రెండు వారాల్లో తగిన నిర్ణయం తీసుకోవాలని ఆదేశించింది.

సోమవారం రాజ్‌భవన్‌లో నూతన ఎమ్మెల్యేలతో కూడిన గెజిట్‌ను గవర్నర్ తమిళిసైకి అందజేస్తున్న రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి వికాస్‌రాజ్

మూడో అసెంబ్లీ ఏర్పాటు

- గవర్నర్‌కు గెజిట్ అందజేసిన సీఈవో వికాస్‌రాజ్

హైదరాబాద్, డిసెంబర్ 4 (నమస్తే తెలంగాణ): నూతన శాసనసభ్యులతో మూడో కొత్త అసెంబ్లీని ఏర్పాటు చేస్తూ గవర్నర్ తమిళిసై సౌందర్‌రాజన్ నోటిఫికేషన్ విడుదల చేశారు. సోమవారం రాజ్‌భవన్‌లో ఎన్నికల ప్రధానాధికారి వికాస్‌రాజ్, కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కార్యదర్శి అవినాశ్ కుమార్ ఎన్నికల సంఘం విడుదల చేసిన గెజిట్‌ను గవర్నర్‌కు అందజేశారు. నవంబర్ 3న ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కాగా నవంబర్ 30న ఎన్నికలు జరిగాయి. ఈ నెల 3న ఓట్ల లెక్కింపు అనంతరం గెలిచిన అభ్యర్థుల వివరాలను ఎన్నికల సంఘం ప్రకటించింది. ఈసీ గెజిట్ ఆధారంగా కొత్త అసెంబ్లీపై గవర్నర్ పేరు మీదుగా అసెంబ్లీ కార్యదర్శి నర్సింహాచార్యులు నోటిఫికేషన్ విడుదల చేశారు.

కాంగ్రెస్‌లో కుర్చీలాట

మొదటిపేజీ తరువాయి...

నలుగురు ఏఐసీసీ పరిశీలకులతో కలిసి సోమవారం ప్రత్యేక విమానంలో ఢిల్లీకి బయల్దేరి వెళ్లారు. మంగళవారం సోనియాగాంధీ సమక్షంలో చర్చించి ఏదో ఒక నిర్ణయం తీసుకొంటారని భావిస్తున్నారు.

రాజ్‌భవన్‌లో ఏర్పాట్లు.. చివరికి వాయిదా

అధిష్ఠానం సూచనతో సీఎల్పీ భేటీలో సీఎం అభ్యర్థి ఎంపిక పూర్తవుతుందని, వెంటనే ప్రమాణ స్వీకారం కూడా నిర్వహించాలని పార్టీ భావించినట్టు తెలిసింది. తొలుత సీఎంతో పాటు ఇద్దరు డిప్యూటీ సీఎంల ప్రమాణ స్వీకారం ఉంటుందని ప్రచారం చేశారు. ఇందుకు సంబంధించి రాజ్‌భవన్ వర్గాలతోపాటు అధికారులకు కూడా సమాచారం ఇచ్చినట్టు తెలిసింది. దీంతో అధికారులు రాజ్‌భవన్‌లో ప్రమాణ స్వీకార ఏర్పాట్లు చేశారు. కుర్చీలు, టెంట్లను తరలించి ఏర్పాట్లు పూర్తి చేశారు. కానీ చివరికి సీఎల్పీ భేటీలో సీఎం అభ్యర్థిపై ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడం, అధిష్ఠానం కూడా ఎలాంటి నిర్ణయం వెలువరించకపోవడంతో ఈ కార్యక్రమం వాయిదా పడింది.

శ్రీరాజరాజేశ్వరస్వామి దేవస్థానము, వేములవాడ, రాజన్న సిరిసిల్లా జిల్లా

ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్ మరియు షార్ట్ టెండర్ నోటీసు

ఆర్.సి.నం.Hs/1713/2023 తేది: 02-12-2023

శ్రీరాజరాజేశ్వరస్వామి దేవస్థానము వేములవాడ దేవస్థానమునకు సంబందించిన భీమేశ్వర సదన్, పార్వతీపురం ధర్మశాలల యందు హౌజ్ కీపింగ్ & సానిటేషన్ పనుల నిర్వహణకు 2 సంవత్సరముల కాలముల పాటు మరియు తేది: 01-04-2024 నుండి తేది: 31-03-2025 వరకు అవసరమగు సానిటరీ మెటీరియల్ సరఫరా చేయుటకు మరియు ధర్మశాలలకు అవసరమగు సామాగ్రి తాళాలు, బకెట్లు మున్నగునవి సరఫరా చేయుటకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్లు కోరబడుచున్నవి. టెండరు ప్రకటన మరియు టెండరు వివరాలు https://tender.telangana.gov.inకు లాగిన్ అవ్వండి. కరెంట్ టెండర్స్‌పై క్లిక్ చేసి శ్రీరాజరాజేశ్వర స్వామి దేవస్థానము, మార్కెటింగ్ సెలెక్ట్ చేయండి. ఇతర వివరములకు సంప్రదించవలసిన మొబైల్ నం.లు సానిటేషన్ పర్యవేక్షకులు 9502765773 రిసెప్షన్ సూపరింటెండెంట్ 8919077763 సానిటేషన్ ఇంచార్జి 8639452436 సానిటేషన్ స్టోర్స్ ఇంచార్జి 9381225084 ఏ.ఇ.ఓ 8977711089.

DIPR RO.No. 8387-PP/CL/ADVT/1/2023-24, Dt: 04-12-2023 సం/- కార్యనిర్వహణాధికారి

శంషాబాద్‌లో నిర్మించనున్న కస్టమ్స్ హౌస్ భూమిపూజలో పాల్గొన్న వివేక్ రంజన్, సందీప్ ప్రకాశ్

కస్టమ్స్ హౌస్‌కు భూమిపూజ

హైదరాబాద్, డిసెంబర్ 4 (నమస్తే తెలంగాణ): శంషాబాద్‌లో నూతనంగా నిర్మించనున్న హైదరాబాద్ కస్టమ్స్ హౌస్‌కు సోమవారం భూమిపూజ నిర్వహించారు. సీబీఐసీ (సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఇండైరెక్ట్ ట్యాక్సెస్ అండ్ కస్టమ్స్) మెంబర్ వివేక్ రంజన్ భూమిపూజ చేయగా, సెంట్రల్ జీఎస్టీ చీఫ్ కమిషనర్ సందీప్ ప్రకాశ్, ఇతర అధికారులు కార్యక్రమంలో పాల్గొన్నారు. రూ.44 కోట్ల వ్యయంతో చేపట్టిన కస్టమ్స్ నూతన పరిపాలనా భవన నిర్మాణం 2025 నాటికి పూర్తి కానున్నది. ఎయిర్‌పోర్ట్‌కు సమీపంలోని మామిడిపల్లిలో నాలుగు అంతస్తుల ఈ నూతన భవనం అత్యాధునిక వసతులతో అందుబాటులోకి రానున్నది.

ఏపీ రాజధాని అమరావతే: కేంద్రం

హైదరాబాద్, డిసెంబర్ 4 (నమస్తే తెలంగాణ): ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతేనని కేంద్ర పట్టణాభివృద్ధి సహాయ మంత్రి కౌశల్‌కుమార్ సోమవారం రాజ్యసభలో రాతపూర్వకంగా వెల్లడించారు. దేశంలో త్రిపుర, నాగాలాండ్‌కే మాస్టర్ ప్లాన్లు లేవని, మిగతా అన్ని రాష్ట్రాలకు మాస్టర్ ప్లాన్లు ఉన్నాయని తెలిపారు.

బీఆర్ఎస్ నేతలపై కాంగ్రెస్ దాడులు

- మహబూబ్‌నగర్‌లో పలువురి ఇండ్ల కిటికీలు ధ్వంసం
- నల్లగొండ మున్సిపల్ చైర్మన్ సైదిరెడ్డి ఇంటిపై దాడి

హన్వాడ/కొల్లాపూర్/పెద్దకొత్తపల్లి/నీలగిరి, డిసెంబర్ 4: నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్, నల్లగొండ జిల్లాల్లో కాంగ్రెస్ కార్యకర్తలు ఆదివారం రాత్రి దాడులకు దిగారు. కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపు సందర్భంగా నిర్వహించిన విజయోత్సవ ర్యాలీల్లో భాగంగా.. బీఆర్ఎస్ నాయకుల ఇండ్ల వద్ద పటాకులు కాల్చి హల్‌చల్ చేశారు. ఈ క్రమంలో వారి ఇండ్లపై, వారి కుటుంబ సభ్యులపై దాడులు చేసి భయభ్రాంతులకు గురిచేశారు. ఇరువురు ఆయా పోలీస్‌స్టేషన్లలో ఫిర్యాదులు చేసుకోగా.. కేసులు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు. వివరాల్లోకి వెళ్తే..

- కాంగ్రెస్ అభ్యర్థి యెన్నం శ్రీనివాస్‌రెడ్డి గెలుపొందడంతో మహబూబ్‌నగర్ జిల్లా హన్వాడ మండలం పల్లెమోనికాలనీలో సంబురాలు నిర్వహించారు. బీఆర్ఎస్ సర్పంచ్ వెంకటమ్మ భర్త పెద్ద వెంకన్న తన ఇంటి దగ్గరే ఉండి ఈ సంబురాలను చూస్తుండగా.. అదే కాలనీకి చెందిన శ్రీకాంత్, శివకుమార్, రమేశ్ ఆయనపై అకారణంగా దాడి చేశారు. బీఆర్ఎస్ కార్యకర్త ఆంజనేయులుపై కూడా దాడి చేయడంతో తలకు గాయాలయ్యాయి. ఈ మేరకు వారు హన్వాడ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై ఎస్సై రవినాయక్‌ను వివరణ కోరగా ఇద్దరూ ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేశారని తెలిపారు.
- నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో కాంగ్రెస్ కార్యకర్తలు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తల ఇండ్లపై దాడులు చేశారు. కొల్లాపూర్ మండలం సింగవట్నంలో కాంగ్రెస్ శ్రేణులు విజయోత్సవ ర్యాలీ నిర్వహిస్తున్న సమయంలో.. బీఆర్ఎస్ కార్యకర్తలు శివ, బాలపీరు, రాముడు ఆ పక్క నుంచి కారులో వెళ్తుండగా కారుపైకి రాళ్లు విసిరారు. వారు కారు దిగొచ్చి కారుపై రాళ్లు ఎందుకు వేశారని ప్రశ్నించగా.. ఆగ్రహంతో వారిని వెంబడిస్తూ రాళ్లతో దాడిచేశారు.
- పెద్దకొత్తపల్లి మండలం సాతాపూర్‌లో పోలింగ్ ముందు రోజు రాత్రి కత్తిపోటుకు గురైన మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్, బీఆర్ఎస్ నాయకుడు గుజ్జుల పరమేశ్ ఇంటిపై కాంగ్రెస్ కార్యకర్తలు రాళ్లతో దాడి చేశారు. ఈ దాడిలో ఇంటి కిటికీ అద్దాలు, గేటు ధ్వంసమయ్యాయి.
- దేవినేనిపల్లిలో బీఆర్ఎస్ నాయకుడు మల్లేశ్(ఎంపీటీసీ భర్త) ఇంటిపై, శ్రీపతి రావు ఇంటిపై దాడులు చేసి కిటికీలు పగలగొట్టారు. కురుమ కులానికి చెందిన భార్యాభర్తలను కొట్టడంతోపాటు వాల్మీకి కార్యకర్త ఇంటిపైనున్న ప్లాస్టిక్ కవర్‌కు నిప్పుపెట్టారు.
- నల్లగొండ మున్సిపాలిటీలోని 16వ వార్డు కౌన్సిలర్ భర్త జేరిపోతుల భాస్కర్‌గౌడ్, తన సోదరులు, కాంగ్రెస్ కార్యకర్తలు కలిసి స్థానిక మున్సిపల్ చైర్మన్ సైదిరెడ్డి ఇంటి ముందు పటాకులు కాలుస్తూ హంగామా చేశారు. ఆ సమయంలో సైదిరెడ్డి ఇంట్లో లేరు. పటాకుల నిప్పురవ్వలు ఎగిరి ఇంట్లో పడుతుండటాన్ని చైర్మన్ భార్య సెల్‌ఫోన్‌లో చిత్రీకరిస్తుంటే.. ఆమె ఫోన్‌ను గుంజుకునేందుకు ప్రయత్నించారు. చైర్మన్ తల్లిపై కూడా దాడి చేశారు. విషయం తెలుసుకున్న సైదిరెడ్డి ఇంటి కొచ్చే సరికి వారు అక్కడి నుంచి పరారయ్యారు. ఈ ఘటనపై నల్లగొండ రూరల్ పోలీస్‌స్టేషన్‌లో చైర్మన్ సైదిరెడ్డి కేసు పెట్టారు. తన కారును ధ్వంసం చేశారని భాస్కర్‌గౌడ్ కూడా వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఇరువురిపై కేసులు నమోదు చేసినట్టు నల్లగొండ రూరల్ ఎస్సై భాస్కర్‌రెడ్డి తెలిపారు.

స్వల్ప తేడాతో నలుగురు బీఆర్ఎస్ అభ్యర్థులు ఓటమి

హైదరాబాద్, డిసెంబర్ 4 (నమస్తే తెలంగాణ): శాసనసభ ఎన్నికల్లో స్వల్ప ఓట్ల తేడాతో నలుగురు బీఆర్ఎస్ అభ్యర్థులు ఓటమి పాలయ్యారు. ఐదు వేల ఓట్ల లోపు మెజార్టీతో నాలుగు సీట్లను బీఆర్ఎస్ కోల్పోయింది. పార్టీ 39 స్థానాల్లో గెలువగా నాలుగు స్థానాల్లో స్వల్ప తేడాతో ఓటమిపాలైంది. దేవరకద్ర లాంటి స్థానంలో చివరి వరకు ముందంజలో ఉన్నా.. చివరి రౌండ్ ఓట్ల లెక్కింపులో పరాజయం పాలయ్యారు. జుక్కల్, దేవరకద్ర, బోధన్, ఖానాపూర్ నియోజకవరాలు స్వల్ప తేడాతో ఓడిపోయిన స్థానాల్లో ఉన్నాయి.

అతి తక్కువ మెజార్టీతో ఓడిపోయిన బీఆర్ఎస్ అభ్యర్థులు

నియోజకవర్గం	బీఆర్ఎస్	ఓట్లు	కాంగ్రెస్	ఓట్లు	కాంగ్రెస్ మెజార్టీ
జుక్కల్	హన్మంతు షిండే	63,337	టీ లక్ష్మీకాంతారావు	64,489	1,152
దేవరకద్ర	ఆల వెంకటేశ్వర్‌రెడ్డి	87,159	జీ మధుసూదన్‌రెడ్డి	88,551	1,392
బోధన్	షకీల్ అహ్మద్	63,901	పీ సుదర్శన్‌రెడ్డి	66,963	3,062
ఖానాపూర్	జాన్సన్‌నాయక్	54,168	ఎడ్మ బొజ్జు	58,870	4,702

జనాదరణ దక్కని జనసేన

- అన్ని స్థానాల్లో డిపాజిట్లు గల్లంతు

హైదరాబాద్, డిసెంబర్ 4 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర శాసనసభ ఎన్నికల్లో బీజేపీతో కలిసి పోటీచేసిన జనసేన పార్టీకి ఎక్కడా కూడా డిపాజిట్లు దక్కలేదు. పొత్తులో భాగంగా జనసేనకు ఎనిమిది సీట్లను బీజేపీ కేటాయించింది. వాటిలో హైదరాబాద్ నగరంలో కూకట్‌పల్లి ఉండగా మిగిలినవి ఇతర జిల్లాల్లో ఉన్నాయి. అయితే ఎక్కడా కూడా జనసేనకు కనీసం డిపాజిట్ దక్కలేదు. కూకట్‌పల్లిలో మాత్రమే ఆ పార్టీ 39 వేల ఓట్లను తెచ్చుకోగలిగింది. మిగిలిన స్థానాల్లో నాలుగు వేల ఓట్లను దాటలేదు. ఆ పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ ప్రచారం చేసినా కూడా తెలంగాణ ఓటర్లు ఆ పార్టీని కనీస స్థాయిలో కూడా ఆదరించలేదు.

జనసేన పోటీ చేసిన స్థానాలు.. వచ్చిన ఓట్లు

కూకట్‌పల్లి	ఎం ప్రేమ్ కుమార్	39,830
కొత్తగూడెం	ఎల్ సురేంద్రరావు	1,945
అశ్వరావుపేట	ఎం ఉమాదేవి	2,281
నాగర్‌కర్నూలు	వీ లక్ష్మణ్‌గౌడ్	1,955
తాండూరు	ఎన్ శంకర్‌గౌడ్	4,087
కోదాడ	ఎం సతీశ్ రెడ్డి	2,151
ఖమ్మం	ఎం రామకృష్ణ	4,040
వైరా	సంపత్ నాయక్	2,712